

సంక్షేమం ధ్యేయంగా.. అభివృద్ధి అజెండాగా..





నిర్మాణంలో భోగాపురం ఎయిర్‌పోర్టు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంక్షేమమే ధ్యేయంగా.. అభివృద్ధే అజెండాగా సాగింది. సామాజిక పింఛన్ల పెంపుతో ఆదిలోనే పేదల పెన్నిధి అనిపించుకుంది. ఒకేసారి రూ.1000 పెంచి లబ్ధిదారుల మోములో వెలుగు నింపింది. మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ఓ దారి చూపింది. ఉచిత గ్యాస్ సిలిండర్లతో పేదలకు ఆర్థిక భారం తగ్గించింది. ఉచిత ఇసుక విధానంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల గృహ నిర్మాణాలకు కొండంత అండగా నిలిచింది. వాట్సాప్ గవర్నెన్స్ సేవలతో పారదర్శక ఈ-పాలనకు శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల దారి కష్టాలకు తెరదించుతూ రాష్ట్రమంతటా రహదారుల నిర్మాణాన్ని చేపట్టి ప్రజలందరి మన్నన పొందింది. పేదవారి ఆకలి తీర్చే లక్ష్యంతో రూ.5కే రుచికరమైన భోజనం అందించే అన్న క్యాంటీన్లను కూడా పునఃప్రారంభించింది. మరోవైపు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వాయువేగంతో ముందుకు తీసుకెళ్తోంది. నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ప్రకటించి పారిశ్రామిక ప్రగతిని సరికొత్త మార్గంలో పరుగులు పెట్టిస్తోంది. కీలకమైన గిరిజన యూనివర్సిటీని సాకారం చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. మొత్తంగా ఏడాది కూటమి పాలన శభాష్ అనిపించుకుంది.

- అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు
- ఉచిత ఇసుకతో ఊపందుకున్న గృహ నిర్మాణం
- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో వెలుగులు
- ఉచిత గ్యాస్‌తో పేద కుటుంబాలకు ఊతం
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రోత్సాహం
- పేదల ఆకలి తీర్చుతున్న అన్నాక్యాంటీన్లు
- వాయువేగంతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం
- చురుగ్గా గిరిజన వర్సిటీ భవనాల పనులు
- ఇదీ ఏడాది కూటమి పాలన ప్రత్యేకత

విజయనగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి)

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వచ్చింది. ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే వైసీపీ హయాంలో గాడి తప్పిన పాలనను సరిచేసే ప్రయత్నం చేసింది. అదే సమయంలో అనేక అభివృద్ధి పనులతో కూటమి తొలి ఏడాది పాలన నడిచింది. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. దేశంలో అన్నిరాష్ట్రాల ప్రభుత్వాలను ఆకర్షించింది. ఒకేసారి ఏకంగా రూ.1000 పెంచి.. ఒక్కో లబ్ధిదారుడికి రూ.4 వేలు అందిస్తోంది. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచింది. ఇక మంచానికే పరిమితమైన రోగులకు, దివ్యాంగులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందిస్తోంది. జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు (మిగతా 6వ పేజీలో..)

అభివృద్ధి ఫలాలు..



జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేనంతగా ఎస్.కోట నియోజకవర్గం అభివృద్ధి చెందుతోంది. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు రూ.900 కోట్లతో నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం త్వరలో సాకారం కానుంది. నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులు రూ.165 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొత్తవలస ఎలక్ట్రికల్ ఫీడర్, సబ్ స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. చిట్టింపాడు నుంచి మారిక, రేగ, పుణ్యగిరి రోడ్డుకు రూ.12 కోట్లు కేటాయించాం.

-కోళ్ల లలితకుమారి, ఎస్.కోట ఎమ్మెల్యే



నిర్మాణంలో గిరిజన వర్సిటీ భవనం

అభివృద్ధి, సంక్షేమ పాలన



ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ముందుకు తీసుకువెళ్లగలిగాం. ఎన్నికల హామీలు శతశాతం నెరవేర్చే ప్రయత్నం జరుగుతోంది. సామాజిక పెన్షన్ల పెంపు, స్పౌజ్ కోటా మంజూరు, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల అమలవుతున్నాయి. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. ప్రతి నియోజకవర్గానికీ ఒక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయనున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్టునిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

-రాష్ట్ర మంత్రి కొండపల్లి

ఏడాది పాలన అద్భుతం



సూపర్ సిక్స్ హామీలు పరిపూర్ణంగా అమలు చేస్తాం. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదువుకున్న పిల్లలు అందరికీ రూ.15 వేలు అందజేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు కానుంది. మరో రెండేళ్లలో జిల్లా దశ, దిశ దేదీప్యమానంగా వెలిగిపోనుంది. ఎంపీ నిధుల ద్వారా జిల్లాలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి రోడ్లు, భవన నిర్మాణాలు చేపడుతున్నాం.

-ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

నవశకం మొదలైంది



రాష్ట్రం, జిల్లాలో నవశకం మొదలైంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకుడు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం, జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. చీపురుపల్లి నియోజకవర్గంలో ఏడాది పాలనలో తోటపల్లికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నాం. చీపురుపల్లి వందపడకల ఆసుపత్రి ఆధునికీకరణ అవసరమైన వైద్య పరికరాలకు రూ.34 కోట్లు మంజూరుకు కృషి చేశాం.

-కళా వెంకటరావు, చీపురుపల్లి ఎమ్మెల్యే

హామీలు అమలు



ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతున్నాయి. నియోజకవర్గంలో రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. పాలకొండ-రాజాం-విజయనగరం రోడ్డు అభివృద్ధికి సంబంధించి నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమైంది. రాజాం పట్టణంలో రహదారి సమస్య త్వరలో తీరనుంది. ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణాలకు రూ.7 కోట్లు ఖర్చు చేశాం.

-కోండ్రు మురళీమోహన్, రాజాం ఎమ్మెల్యే

ఉపాధి నిధులతో పనులు



నియోజకవర్గానికి ఉపాధి హామీ నిధులు సుమారు రూ.70 కోట్లు మంజూరయ్యాయి. విజయనగరం మండలం పరిసర ప్రాంతాలు, గ్రామాల్లో రోడ్లు, భవన నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. వై.జంక్షన్ నుంచి కోరాడపేట వరకూ రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. జిల్లా కేంద్రంలో పలు చోట్ల ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ప్రశాంత్‌నగర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగింది.

-పూసపాటి అదితిగజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే

అభివృద్ధి పరుగులు



నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు గడిచిన ఏడాదిలో జెట్ స్పీడుతో జరుగుతున్నాయి. ఈ నియోజకవర్గంలో మత్స్యకార గ్రామాలు అధికంగా వున్నాయి.

-లోకం నాగమాధవి, నెల్లిమర్ల ఎమ్మెల్యే

పరిశ్రమలు వస్తున్నాయ్



చంద్రబాబు పాలనపై నమ్మకంతో ఏపీ, జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. నియోజకవర్గంలో రూ.125 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొట్టక్కిలో వంద ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు రానుంది. బొబ్బిలి పట్టణంలో అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టాం.

-బేబీనాయన, బొబ్బిలి ఎమ్మెల్యే



బడికి వేళాయె

- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- విద్యామిత్ర కిట్లు సిద్ధం
- సన్నబియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

జిల్లాలో పాఠశాలలు:	2283
విద్యార్థులు:	1.14 లక్షలు
భోజనం చేసేవారి సంఖ్య:	1.12 లక్షలు

విజయనగరం కలెక్టరేట్/ రాజాం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం తొలిసారిగా బడిగంట మోగనుంది. పాఠశాలలన్నీ యథావిధిగా గురువారం తెరుచుకోనున్నాయి. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కూడా సిద్ధమయ్యారు. విద్యార్థులు ఇకపై సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం చేయనున్నారు. మరోవైపు విద్యామిత్ర కిట్లు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా క్లస్టర్ విధానం కూడా అమలులోకి వస్తోంది.

పాఠశాల విద్యను బలోపేతం చేసే దిశగా ఈ ప్రభుత్వం అడుగులు వేసింది. పాఠశాలలు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు సుమారు రూ.2,279 విలువచేసే డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ (మిగతా 6వ పేజీలో..)

సన్నబియ్యంతో భోజనం

మాణిక్యంనాయుడు, డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాట్లు చేశాం. పోర్టిఫైడ్ బియ్యం కావడంతో పోషకాలు అధికంగా ఉంటాయి. విద్యార్థులందరూ పాఠశాలల్లోనే భోజనం చేయాలి. తల్లిదండ్రులు ఇందుకు సహకరించాలి. విద్యామిత్ర కిట్లు కూడా అందించే ఏర్పాట్లు చేశాం.

వైస్ ఛైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- బొబ్బిలిలో ఛైర్మన్ బాటలోనే మద్దతు
- ఈ పదవి కూడా టీడీపీ ఖాతాలో జమ





అవిశ్వాసానికి అనుకూలంగా చేయి ఎత్తిన ఎమ్మెల్యే బేబీనాయన, 21 మంది కౌన్సిలర్లు, (ఇన్‌సెట్‌లో) ఓటింగ్ నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ గొలగాని రమాదేవిపై అవిశ్వాసం నెగ్గింది. ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు ప్రిసైడింగ్ అధికారి హోదాలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ వాడపల్లి వనజాకుమారితో పాటు పలువురు ఇచ్చిన అవిశ్వాసం ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అవిశ్వాసానికి అనుకూలంగా ఎవరెవరు మొగ్గు చూపుతున్నారో చేతులెత్తే పద్ధతిలో తెలియజేయాలని కోరారు. సమావేశానికి హాజరైన 22 మంది సభ్యులూ అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఎవరైనా మద్దతు తెలుపుతున్నారా? అని ఆయన సమావేశంలో అడిగారు. వ్యతిరేకంగా ఓటు వేసేందుకు కౌన్సిల్‌హాలులో ఎవరూ లేకపోవడంతో వైస్‌ఛైర్‌పర్సన్ గొలగాని రమాదేవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం ప్రతిపాదన నెగ్గినట్లుగా ప్రిసైడింగ్ అధికారి రామ్మోహనరావు ప్రకటించారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే బేబీనాయన కోఆప్షన్ సభ్యుని హోదాలో పాల్గొని అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. ఆయనతో పాటు టీడీపీకి చెందిన మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, ఆ పార్టీకి చెందిన తొమ్మిది మంది (మిగతా 6వ పేజీలో..)

విజయనగరంలో యోగాంధ్ర సంతకం

యోగా విశిష్టత చాటుతూ విజయనగరం సంతకాల వంతెనపై వేసిన చిత్రాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. యోగాంధ్ర పేరుతో ఇప్పటికే ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు భారీగా ప్రచారం చేస్తోంది. ప్రజల చేత ఎక్కడికక్కడ యోగాసనాలు వేయిస్తోంది. ఈ ప్రక్రియలో అధికార యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేసింది. ప్రతి ఒక్కరూ యోగాను అలవరుచుకోవాలని కోరుతోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే సంతకాల వంతెనపై విజయనగరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాల చిత్రాలు వేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఆ మేరకు ఆకట్టుకునేలా చిత్రీకరించారు.

- విజయనగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):



జగన్నాథస్వామికి జ్యేష్టాభిషేకం

విజయనగరం రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని అన్ని జగన్నాథుని ఆలయాల్లో బుధవారం జ్యేష్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. రథయాత్రకు ముందు ఈ ప్రక్రియను చేపట్టడం ఆనవాయితీ. ఉదయం 7 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని అర్చకులు చేపట్టారు. సంతపేట, దాసన్నపేట జగన్నాథ స్వామి ఆలయాలతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం, చిక్కాల వీధిలోని ఆలయం, కాళ్లనాయుడు మందిరం ఆవరణలోని ఆలయంలో జ్యేష్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు.



సంతపేట రోడ్డులో జగన్నాథుని ఆలయంలో జ్యేష్టాభిషేకం

5 నేడు రామతీర్థంలో యోగాంధ్ర
5 ప్రభుత్వ భూమిపై రిటైర్డ్ వీఆర్వో కన్ను
5 సన్న బియ్యం ప్యాకెట్లకు క్యూఆర్ ట్యాగ్
5 అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లు: మంత్రి

రాత్రి వరకూ టీచర్ల కౌన్సెలింగ్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీటీ బదిలీల ప్రక్రియ బుధవారం రాత్రి పదిన్నర గంటల వరకు కొనసాగింది. ఉదయం సీరియల్ నెంబర్ 148 వరకు సజావుగానే ప్రక్రియ సాగింది. ఆ తర్వాత స్పౌజ్ కోటాలో పాఠశాల ఎంపిక విషయమై వాగ్వాదం జరిగింది. దీంతో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. ఈ విషయమై సీఎస్ఈ నుంచి స్పష్టత రావడంతో మళ్లీ కౌన్సెలింగ్ పునఃప్రారంభమైంది. సీరియల్ నెంబర్ 1 నుంచి 800 వరకు కౌన్సెలింగ్ జరపాలని తొలుత భావించారు. సమయాభావం వల్ల సీరియల్ నెంబర్ 1 నుంచి 500 వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. పలువురు తమకు నచ్చిన ప్రాంతాల్లో పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు.



నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు



తెర్లాం: నెమలాంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బొబ్బిలి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టనున్న మెటీరియల్ కంపోనెంట్ పనులకు బుధవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.10.83 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, బీటీ రోడ్లు, తదితర పనులను బొబ్బిలి మండలంలో చేపట్టనున్నట్టు తెలిపారు.

● తెర్లాం: నెమలాం గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, ఏఎంసీ ఛైర్మన్ వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, పీఆర్‌జేఈ సత్యం, ఎమ్మార్వో హేమంత్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు ఉన్నారు.

● బాడంగి: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని 107 పనులకు సంబంధించి రూ.13కోట్ల 68 లక్షల 80వేలు మంజూరైనట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. బుధవారం పాల్తేరు గ్రామంలో వాటికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.05కోట్లతో విద్యుత్ పనులు

బొబ్బిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో రూ.5.05కోట్లతో పలు విద్యుత్ సంబంధిత అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. బుధవారం స్థానిక రాజానగర్ కాలనీలో ఆయన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.54.84 లక్షలతో 11అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.4.5కోట్లతో ఆరు ఫీడర్లను విడదీసే పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, టీడీపీ నేతలు ఎ.భాస్కరరావు, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సన్న బియ్యం ప్యాకెట్లకు క్యూఆర్ ట్యాగ్

విజయనగరం కలెక్టరేట్, జూన్11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు ఈ నెల నుంచి ప్రతి పాఠశాలకు ఫైన్ క్వాలిటీ సన్నబియ్యం పంపిణీ చేపట్టడం జరుగుతుందని జేసీ సేతు మాధవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25 కేజీల బ్యాగ్‌లు చొప్పున అందిస్తున్నామన్నారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి బ్యాగ్‌కు క్యూఆర్ కోడ్ కలిగిన ట్యాగ్‌ను జతపరుస్తూ స్కూల్, హాస్టల్స్ ఐఎంఎంఎస్ ఐఎన్‌బీ యాప్ ద్వారా స్కాన్ విధానంలో పంపిణీ చేస్తామన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

బొబ్బిలి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ, ఎంఈవో వాసుదేవరావు, వ్యవసాయ అధికారి శ్యామ్‌సుందర్ మాట్లాడారు. కోటసీతారామపురం సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు కదలికలపై నిఘా పెట్టి, మండల పరిధిలోకి రాకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎంపీపీ అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

యోగా జీవితంలో భాగం కావాలి

బొబ్బిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలు ప్రతిఒక్కరి నిత్య జీవన విధానంలో భాగం కావాలని మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఆసనాలు వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

నీచ రాజకీయాలు తగదు

బొబ్బిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలకు ఒడిగడుతోందని వైసీపీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆరోపించారు. మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గొలగాని రమాదేవిపై అవిశ్వాసం పెట్టడాన్ని ఆయన తప్పుబడుతూ బుధవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 21 మంది కౌన్సిలర్లను ప్రజలు గెలిపిస్తే వారిలో సగం మందిని పలు రకాల ప్రలోభాలతో లోబరుచుకోవడం సిగ్గుచేటన్నారు.

సత్ప్రవర్తన అలవరచుకోవాలి

రేగిడి, జూన్11 (ఆంధ్రజ్యోతి): అందరూ సత్ప్రవర్తన అలవరచుకోవాలని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు అన్నారు. మండలంలో రేగిడి దత్తపీఠంలో బుధవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక దత్తపీఠ కార్యానిర్వాహక అధ్యక్షుడు కిమిడి సూరపనాయుడు, రవిశంకర్ ఆధ్వర్యంలో దత్త జ్ఞాన బోధసభ నిర్వహించారు. కార్యక్రమంలో సామంతులు దామోదరరావు, ఎన్‌వీరమణ, చందక సింహాచలం, గొర్లి దామోదరరావు, కె.రామ్మోహనరావు, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో చండీయాగం

విజయనగరం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా చండీయాగాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని వనంగుడి, మూడులాంతర్ల వద్ద చదురు గుడిలో హోమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



దత్తిరాజేరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దేవుపల్లి గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలికా అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.2.12 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం జనవరి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు వంద కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, అనంతరం గ్రామస్థుల నుంచి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గ్రం థాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో జి.గిరిబాల, పీఆర్ జేఈ పి.అప్పల నాయుడు, ఏఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీవీవీ గోపాలరాజు, కోరాడ కృష్ణ పాల్గొన్నారు.

చేతల ప్రభుత్వమిది..

●దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సాధ్యమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని పునరుద్ఘాటించారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కాలేజీ వసతి భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్ సదుపాయాన్ని పరిశీలించారు. ఆయన వెంట సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, మాజీ ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి, మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ



సారికలో రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూన్11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం విజయనగరం మండలం సారిక, చెల్లూరు గ్రామాల్లో పల్లె పండుగలో ఏర్పాటైన రోడ్లను ఆమె ప్రారంభించారు. అలాగే నగర పరిధిలోని నగరపాలక సంస్థ జనరల్ ఫండ్‌తో చేపట్టనున్న రోడ్డు, కాలువ పనులకు కెఎల్ పురంలోని రెవెన్యూ కాలనీలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, డివిజన్ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి కృషి జరుగుతోందన్నారు. ప్రజాదర్బార్‌లో కూడా రోడ్లు, కాలువలు వంటి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరిన నేపథ్యంలో దశల వారీగా ఆయా పనులు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంటా వెంకటరావు, మండల ఇంజినీర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

15 డివిజన్లలో శంకుస్థాపనలు

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్ నుంచి 15 వ డివిజన్‌లలో రోడ్లు, కాలువలు, ఇతరత్రా పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్లు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూన్1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు సంబంధిత మంత్రితో మాట్లాడానన్నారు. కొత్తగా రూ 83.96 లక్షలతో 20 సబ్‌స్టేషన్లు మంజూరు చేయించానన్నారు. త్వరలో స్థల పరిశీలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.ఆశయ్య, డీఈఈ ఫణీంద్రకుమార్, ఏఈలు కుమార్, సురేష్‌బాబు, తహసీల్దార్ ఎం.రాజశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రమేశ్‌కుమార్, పిల్లా సత్యంనాయుడు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

రాజాం, జూన్11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం కంచరాం, ఒమ్మి సచివాల భవనాలు, గార్రాజు చీపురుపల్లిలో హెల్త్ సెంటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సోపేరులో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి సేవలు తీసుకురావాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో వంగా వెంకటరావు, మాడుగుల జయరాం, నంది సూర్యప్రకాశరావు, గురవాన నారాయణరావు, రౌతు వెంకటరమణ, పొన్నాడ భీమేశ్వరరావు, బీజేపీ నాయుకులు కోటగిరి నారాయణరావు, వల్లూరు గణేశ్, ఉర్లాపు పోలిరాజు. ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

●వంగర: టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం సంగాం, మద్దువలస, రుషింగి, బంగారువలసల్లో రహదారుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వాటిని ప్రభుత్వం గుర్తించి వాటిని క్రమంగా అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి పక్కా రహదారి, సాగు, తాగునీరు అందించడమే ధ్యేయమన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నా మన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు, ఫైల వెంకటరమణ, ఎల్.కృష్ణమూర్తి, మోహనరావు తదితరులున్నారు.

నేడు రామతీర్థంలో యోగాంధ్ర

నెల్లిమర్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలోని కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 12న జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జేసీ సేథు మాధవన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమం విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లును చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

100, 112 కాల్స్‌పై స్పందించాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, జూన్11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు అధికారులు డయల్-100, 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఆంధ్ర పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సీతారాం డయల్-100, 112 కాల్స్‌కు సకాలంలో స్పందించి ఘటన స్థలానికి చేరుకుని రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఇరువురు ప్రాణాలు కాపాడి ఉద్యోగ బాధ్యతలను అంకితభావంతో నిర్వహించిన నేపథ్యంలో ఆయన్ని ఎస్పీ అభినందించారు. జూన్ 10న రాత్రి 8 గంటల సమయంలో బిరసాడవలస సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయరహదారిపై ప్రమాదం జరిగిందని వివరించారు. ఇదే స్ఫూర్తితో డయల్ 100 కాల్స్‌కు అధికారులు స్పందించాలని ఆయన ఆదేశించారు.

ప్రతి హామీ అమలు చేస్తాం



నాగలితో దుక్కి వేస్తున్న ఎమ్మెల్యే కళా

గుర్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రతీ గ్రామంలోనూ పండగ వాతావరణం నెలకొంది. రైతులు ప్రజలు నీరాజనాలు పట్టారు. మండలంలోని శేషపుపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గుర్ల ఎన్టీఆర్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కస్తూరిబా గురుకుల పాఠశాలలో రూ.2.21 కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి, జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.4.95 లక్షలతో కళావేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వల్లాపురం, శేషపుపేట గ్రామాల్లో రైతు సేవాకేంద్రం, పల్లెపండగ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జడ్పీటీసీ సభ్యుడు సీర అప్పలనాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ తిరుమలరాజు కిరణ్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ కిలారి సూర్యనారాయణ, జనసేన నాయకులు వినినిగిరి శ్రీనివాసరావు, రమేష్‌రాజు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో శేషుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శృంగవరపుకోట రూరల్/జామి, జూన్11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం ఎస్.కోట పట్టణం,.. ధర్మవరంలో అభివృద్ధి పనులు, జామిలో రూ.1.40 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలోనాయకులు జి.ఎస్.నాయుడు, వర్రి రమణ, డోకుల చిన అచ్చెన్నాయుడు, వెలమసంఘ డైరెక్టర్ శ్రీలక్ష్మి, లగుడు తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

కొత్తవలస, జూన్11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె మండలంలోని వియ్యంపేట పంచాయతీ కొట్టానవానిపాలెం, రామలింగపురం, వీరభద్రపురం పంచాయతీ ములగపాకవానిపాలెం గ్రామాల్లో రూ.50 లక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామసభల్లో ఆమోదం పొందిన వివిధ పనులకు ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, టీడీపీ నాయకులు గొరపల్లి రాము, చింతలపాలెం సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల శ్రీను, నాయకులు యల్లపుసూరిబాబు, రత్నాజీ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో స్మార్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

విజయనగరం రూరల్, జూన్11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగర శివార్లలోని గురజాడ జేఎన్‌టీయూలో బుధవారం స్మార్ట్ స్కిల్స్ సెక్యూర్ ఫీచర్ అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ జరిగింది. ఎస్‌బీఐ సహకారంతో వర్సిటీలోని నాన్ టీచింగ్ స్టాఫ్‌నకు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, డాకర్ హేమతో పాటు బ్యాంకు అధికారులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఘనంగా జ్యేష్టాభిషేకం



రామచంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, జూన్11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారి దేవస్థానంలో బుధవారం జేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని రామచంద్రస్వామి వారికి జేష్టాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో నవకలశారాధన నిర్వహించారు. రామచంద్రస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పళ్లరసాలు, వివిధ నదీ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి నిత్య కళ్యాణోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఈవో వైశ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్ కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు పాల్గొన్నారు.

విచారణపై వేతనదారుల అసంతృప్తి

శృంగవరపుకోట రూరల్, జూన్11 (ఆంధ్రజ్యోతి): అక్రమాలపై పా ల్పడిన మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ పద్మజ బుధవారం చేపట్టిన విచారణపై వేతనదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేతన దారులు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ కుమారుడు రెండు చోట్ల ఉపాధి పనులు ఎలా చేశాడని ప్రశ్నించారు. ఎక్కడో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువకుడు మధ్యమధ్యలో ఉపాధి పనికి వచ్చి ఏడాదికి 100 పని ఎలాచేశాడని నిలదీశారు. ముషిడిపల్లికి చెందిన వేతనదారులకు రూ.160 చొప్పున వేతనం ఇస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్ కుమారుడు పని చేసిన జట్టుకు రూ. 240 ఎలా వేశారని ప్రశ్నించారు. ఏపీడీ పద్మజ మాత్రం మీరు చెప్పింది విన డానికి రాలేదని చెప్పడం ఎంతవరకు సమంజససమో చెప్పాలన్నారు. ఈ విచారణపై తమకు నమ్మకం లేదని కలెక్టర్, డ్వామా పీడీలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గజపతినగరం, జూన్11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అనుబంధ సంఘం బీకేఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కండిపల్లి భీముడు, పురం అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వ భూమిపై రిటైర్డ్ వీఆర్వో కన్ను

●30సెంట్లు రూ.60 లక్షలకు బేరం

●విచారణ చేపట్టిన తహసీల్దారు



రిటైర్డ్ వీఆర్వో ఆక్రమించిన ప్రభుత్వ భూమి

మెంటాడ, జూన్11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి అనుకుని 30 సెంట్ల ప్రభుత్వ భూమిపై మెంటాడకు చెందిన రిటైర్డ్ వీఆర్వో కన్నేశారు. దాన్ని రూ.60 లక్షలకు విక్రయించేందుకు బేరం కుదుర్చుకున్నాడు. తన 5 సెంట్ల జిరాయితీ భూమికి అనుకుని సర్వేనెంబర్ 188లో 30 సెంట్ల ఇరిగేషన్ శాఖకు చెందిన భూమి ఉంది. దాన్ని కాజేయాలన్ని ప్రణాళిక సిద్ధం చేశాడు. సెంటు రూ.2 లక్షలు చొప్పున విక్రయానికి బేరం కుదిర్చేశాడు. ప్రభుత్వ భూమి అని తెలియని అవతలి వ్యక్తులు సదరు ప్రభుత్వ భూమిని పురోణీ చేసుకునే వరకు వెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ అరుణకుమారి వద్ద ప్రస్తావించగా సర్వేయర్ నుంచి సమాచారం సేకరించామన్నారు. అక్కడ ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించానన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కొత్తవలస, జూన్11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతపాలెం గ్రామానికి చెందిన కర్రి దివ్య(21) అదృశ్యమైందని తండ్రి కర్రి దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దివ్య పదోతరగతి వరకు చదువుకుంది. కొద్దిరోజుల పాటు విశాఖ జిల్లా పెందుర్తి మండలం, చినముషిడివాడలో జనరిక్ మెడికల్ షాపులో పని చేసింది. ఉద్యోగం మానేసి ఇంటి దగ్గరే ఉంటోంది. గతనెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదని తండ్రి దేముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమార్తె కనిపించడంలేదని..

కొత్తవలస, జూన్11 (ఆంధ్రజ్యోతి): కుమార్తె కనిపించలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ హేమంత్‌కుమార్ బుధవారం కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతలపాలెం పంచాయతీ తాడివానిపాలెం గ్రామానికి చెందిన రాయల అనిత (21) తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన చేశెట్టి వెంకట సురేంద్ర ప్రేమించి 2023 సెప్టెంబర్ 30న వివాహం చేసుకున్నారు. వీరు ఇరువురు ఏడాది పాటు పాటు హైదరాబాద్‌లో కాపురం చేశారు. తర్వాత అక్కడ సురేంద్ర ఉద్యోగం మానేశాడు. మళ్లీ విజయవాడలో ఉద్యోగం కోసమని భార్యను., అనిత తల్లితండ్రులు ఇంటి వద్ద తాడివానిపాలెంలో ఉంచి సురేంద్ర వెళ్లాడు. విజయవాడలో సురేంద్రకు ఉద్యోగం రావడంతో తన భార్యను విజయవాడ పంపించాలని అత్తామామలకు చెప్పాడు. దాంతో వారు గతనెల 7న విజయవాడ వెళ్లేందుకు విశాఖ రైల్వే స్టేషన్‌లో అనితను ఎక్కించారు. అయితే తన భార్య విజయవాడ రాలేదని సురేంద్ర చెప్పడంతో అప్పటి నుంచి వెతుకుతున్నారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో అనిత తల్లి సూరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళలను కించపరచడం తగదు



పత్రికలు దహనం చేస్తున్న నాయకులు

చీపురుపల్లి/గరివిడి, జూన్11 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం సాక్షి పత్రికలను కూటమి నాయకులు దహనం చేశారు. ముందుగా రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలన సాక్షి మీడియా అగౌరవపరుస్తోందన్నారు. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన సాక్షి మీడియా అసత్య ప్రచారాలు చేస్తూ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళా లోకాన్ని కించపరచడం దారుణమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, విసినిగిరి శ్రీను, గద్దె అనురాగ్, ముల్లు రమణ, ముల్లు రమాదేవి, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగా పాటకు అవార్డు ప్రకటన

పార్వతీపురం, జూన్11 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా పాటకు అవార్డు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. యోగా పాటను అర్థవంతంగా రచించి, సంగీతాన్ని సమకూర్చి చక్కగా పాడిన వారికి రూ.లక్ష వరకు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. జిల్లాలో రచయితలు, కవులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలో రిహార్సల్స్ నిర్వహిస్తామన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రదేశాల్లో నిర్వహించే యోగా కార్యక్రమాన్ని వాతావరణ దృష్ట్యా 12న రద్దు చేశామన్నారు. తిరిగి 17న నిర్వహించేందుకు యోచిస్తున్నామన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.హేమలత పాల్గొన్నారు.

బీజేపీతో సుపరిపాలన




మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

బెలగాం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ 11ఏళ్లుగా సుపరిపాలన అందిస్తోందని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ప్రచార రాష్ట్ర కార్యదర్శి సుహాసిని అన్నారు. మోదీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోదీ పాలనపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు, ప్రచార రాష్ట్ర కార్యదర్శి సుహాసిని మాట్లాడుతూ మోదీ ప్రధాని ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డా.యాళ్ల వివేక్, డా.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

సీతంపేట రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పీఎం జుగా సర్వేను వేగవంతం చేసి పూర్తిచేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సీతంపేట, భామిని మండలాల సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో ఎంపికచేసిన గ్రామాల్లో పీఎం జుగా సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలను సర్వేలో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు, ఎంపీడీవోలు బీటీ మిశ్రో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



రామలింగేశ్వరుడు (ఫైల్)

వీరఘట్టం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరఘట్టంలో 110 సంవత్సరాల ఉణ్ణ రామలింగేశ్వరుడు గురువారం సాయంత్రం మృతిచెందారు. 110 సంవత్సరాలైనా ఎంతో ఆరోగ్యంగా ఉంటూ కనీసం కళ్లద్దాలు కూడా లేకుండా పేపర్ చదివే వాడని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి వీరఘట్టంలోని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నిరంతరం పర్యవేక్షణ అవసరం

పార్వతీపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ సర్వేలో గుర్తించిన వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. గంగరేగువలస పంచాయతీ స్వామినాయుడువలస గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గ్రామంలో ఆరోగ్య సర్వేలు జరిగిన తీరుపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. గంగరేగువలస సచివాలయం పరిధిలో మొత్తం 800 ఇళ్లకు పైగా సర్వే చేయగా, కొత్తగా రక్తపోటు 55 మంది, మధుమేహం 21 మంది, క్యాన్సర్ లక్షణాలతో ముగ్గురు నమోదైనట్టు గుర్తించారు. కార్యక్రమంలో కొమరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీని విస్మరించడం తగదు

శృంగవరపుకోట రూరల్, జూన్11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సముచిత స్థానం ఇస్తుంటే స్థానిక నియోజకవర్గంలో అందుకు భిన్నంగా జరుగుతోందని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఎస్.కోటలో బీజేపీ నియోజకవర్గ నాయకులు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తమటపు రాముడు, లోకాబి రామకోటి, రాయవరపు ఆదిలక్ష్మి, చొక్కాకులు అప్పారావు, దాశరధి, చంద్ర శేఖర్, మరిస శ్రీను, కోన మోహన్, దొడ్డి సూర్యారావు మాట్లాడారు. నామినేటెడ్ పోస్టులు సైతం బీజేపీకి కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే లలితకుమారి పొత్తు ధర్మాన్ని పాటించాలని వారు కోరారు.

కొవిడ్ పరీక్షలకు ఏర్పాట్లు

రాజాం, జూన్11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో కొవిడ్ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్టు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎం.కోటీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమికంగా నిర్వహించే కొవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



జెట్ స్పీడ్‌తో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం

● ఏడాదిలోనే మార్పు ● కూటమి ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ


నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయం

భోగాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు జెట్ స్పీడుతో సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్‌తో విమానాశ్రయ నిర్మాణం సాగుతోంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

భోగాపురం ఎయిర్‌పోర్టు కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం సుమారు 2,700 ఎకరాల భూసేకరణ పూర్తి చేసింది. రూ.4,592 కోట్లతో 2019 ఫిబ్రవరి 14న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాదాపు నాలుగేళ్లు కాలయాపన చేసింది. ఆ తరువాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 మే 5న రెండోసారి శంకుస్థాపన చేశారు. అయినా పనులు నత్తనడకన సాగాయి. శంకుస్థాపన చేసిన తరువాత ఏడాది పాటు సుమారు 26 శాతం మాత్రమే ఎయిర్‌పోర్టు పనులు చేయగలిగింది.

ఏడాదిగా పరుగులు

గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం రావడం.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడంతో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు మళ్లీ కదలిక వచ్చింది. గత ఏడాది జూలై నెలలో కేంద్ర మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఇక్కడికి వచ్చేసరికి 26 శాతంగా ఉన్న ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రస్తుతం సుమారు 78 శాతానికి చేరుకున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఏడాది జూలై నెలలో ఇక్కడ పర్యటించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎయిర్‌పోర్టు నిర్మాణం గడువు కన్నా ముందే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత వర్గాలను ఆదేశించారు. దీంతో ఈ పనులు జెట్ స్పీడ్‌తో సాగుతున్నాయి. దీంతో 2026 జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేసి ..ప్రారంభించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఎర్త్ వర్క్స్, రన్‌వే, టాక్సీ వే, టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఇతర భవనాలు, మెయిన్ అప్రోచ్ రహదారి పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 3.8 కిలోమీటర్ల రన్‌వేను నిర్మిస్తున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద రన్‌వే కానుంది.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో...

స్థానికంగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. ఎయిర్‌పోర్ట్, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు, వ్యాపార అభివృద్ధికి అవసరమయ్యే శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్టుకు కనెక్టవిటీ రోడ్లనూ నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో తాజ్ గ్రూప్‌తో పాటు మరికొన్ని స్టార్ హోటల్స్ సిద్ధమవుతున్నాయి. తీర ప్రాంత, పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. మొత్తమ్మీద భోగాపురమే కాకుండా ఉత్తరాంధ్రకే సరికొత్త కళ వచ్చే విధంగా ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంటోంది.

గిరిసీమలో విద్యా పరిమళాలు

● శరవేగంగా గిరిజన వర్సిటీ పనులు
● ప్రత్యేక దృష్టిపెట్టిన ప్రభుత్వం
● త్వరగా అందుబాటులోకి తెచ్చే యోజన

మెంటాడ/దత్తిరాజేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం కోసం 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్ల గ్రామం వద్ద 500 ఎకరాల భూమిని సేకరించారు. కేంద్రం తొలివిడత నిధులను విడుదల చేసింది. పనులు ప్రారంభమైన సమయంలో 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. దీంతో గిరిజన వర్సిటీ పనులకు గ్రహణం పట్టింది. రెల్ల వద్ద అప్పటికే సేకరించి సిద్ధంగా ఉన్న భూములను కాదని, మెంటాడ మండలం కుంతినవలస, దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల్లో 501.88 ఎకరాల భూమిని జగన్ సర్కారు సేకరించింది. కేంద్ర ప్రభుత్వం రూ.834 కోట్ల అంచనా వ్యయం నిర్ణయించింది. మూడేళ్ల కిందట అప్పటి కేంద్ర మంత్రి ధర్మేంద్రతో కలసి జగన్ గిరిజన వర్సిటీ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అతీగతీ లేదు.

సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో గిరిజన వర్సిటీకి మంచి రోజులు వచ్చాయి. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భూములిచ్చిన రైతులు సమస్యలపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టారు. వారికి మానవీయ కోణంలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తన సొంత నియోజకవర్గంలో వర్సిటీని నిర్మిస్తున్నందున గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మరింత ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

14 ప్రతిష్ఠాత్మక కోర్సులు..

గిరిజన వర్సిటీ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. 14 ప్రతిష్ఠాత్మక కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇంగ్లీష్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్, బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, జర్నలిజం, ఎంబీఏ, ఎంఏఎస్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉంటాయి. డిగ్రీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బోటనీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, జియాలజీ, బీకాంలో ఒకేషనల్ తదితర 14 కోర్సులు అందుబాటులోకి వస్తాయి.


శరవేగంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులు

త్వరలో అందుబాటులోకి తెస్తాం..

గిరిజన విశ్వవిద్యాలయం పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాను. పూర్తయిన వెంటనే విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గిరిజన విద్యార్థులకు ఈ యూనివర్సిటీ ఎంతగానో ఉపయోగపడనుంది. -సంధ్యారాణి, మంత్రి

ఎంఎస్‌ఎంఈ పార్కుతో కొత్తరూపు

● రెండువేల మందికి ఉపాధి

శృంగవరపుకోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో శృంగవరపుకోట నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వరద పారించింది. ఎంఎస్ఎంఈ పార్కు, రోడ్ల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించింది. కొత్తవలస మండలం బలిఘట్టం గ్రామ పరిధిలో 57.09 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి ఇటీవల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి భూమి పూజ చేశారు. ఈ పార్కులో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ఆసక్తి ఉన్న వారికి స్థలాలను కేటాయించనున్నారు. ఇందులో ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో ప్రత్యక్షంగా రెండు వేలు, పరోక్షంగా ఐదువేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఏపీఐఐసీ వర్గాలు చెబుతున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో ఉపాధి సమస్యకు పరిష్కారం దొరికినట్టవుతుందని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


బలిఘట్టంలో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి(ఫైల్)

కల ఫలించింది..



నేను గృహిణిని. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కల ఫలించింది. డీఎస్సీ రాసే అవకాశం వచ్చింది. కొన్ని నెలలుగా స్థానిక శాఖా గ్రంథాలయంలో డీఎస్సీకి సాధన చేశాను. ఫలితాలు కూడా వేగంగా విడుదల చేసి నియామకాలు చేపట్టాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రికి, విద్యా శాఖామంత్రికి ధన్యవాదాలు.

-ఎం రేణుక, కోరాడ వీధి, బొబ్బిలి

24 గంటల్లో నగదు జమయింది..



నేను ప్రభుత్వానికి వంద బస్తాల ధాన్యం ఇచ్చాను. ఇరవై నాలుగు గంటల్లో నా ఖాతాకు సొమ్ము జమైంది. చాలా సంతోషించాను. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం సొమ్ము రావడానికి రెండు నెలలు పట్టింది.

- ఆదిరెడ్డి సంతోష్‌కుమార్, చందులూరు, ఎల్.కోట మండలం

పల్లెలకు పండుగే!

● గ్రామాల స్వరూపాన్ని మార్చిన పల్లెపండుగ
● రూ.151.90 కోట్లతో 2,199 పనులు ● ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

విజయనగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'పల్లెపండుగ' కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల స్వరూపమే మారిపోయింది. పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పనకు అవకాశం కలిగింది. దీంతో పల్లెలు కొత్తరూపును సంతరించుకున్నాయి. 2024 గాంధీ జయంతి సందర్భంగా 'పల్లెపండుగ' పేరుతో కూటమి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. సీసీ రోడ్డు, కాలువలు, రహదారుల నిర్మాణం చేపట్టారు. రూ.151.90 కోట్లతో 2,199 పనులు పూర్తి చేసింది.

● **గ్రామసభల్లో గుర్తింపు..**

జిల్లాలో 777 పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది ఆగస్టు 23న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. జిల్లాలో 2,199 పనులను గుర్తించారు. ఇందుకుగాను రూ.151.90 కోట్లు కేటాయించారు.

● **హక్కులు, నిధులకు వైసీపీ కత్తెర**

సర్పంచ్‌ల హక్కులకు.. పంచాయతీల నిధులకు వైసీపీ ప్రభుత్వం కత్తెర వేసింది. పంచాయతీల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. కేవలం పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణ వంటి బాధ్యతలను మాత్రం వాటికి విడిచిపెట్టింది. 14వ ఆర్థిక సంఘం మిగులు... 15వ ఆర్థిక సంఘ నిధులను సైతం ప్రభుత్వం లాగేసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్థిక, ప్రణాళికా సంఘం నిధులు సజావుగా పంచాయతీలకు చేరుతున్నాయి.

● **స్వాతంత్ర్య వేడుకలకు...**

రాజ్యాంగం కల్పించిన హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాసింది. గతంలో ఆగస్టు 15న ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసే బాధ్యత సర్పంచ్‌లకు ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం దీనిని మార్చేసింది. తల్లిదండ్రుల కమిటీకి ఆ బాధ్యతను అప్పగించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వాతంత్ర వేడుకల నిర్వహణకు రూ.10 వేల వంతున అందించింది.

● **పల్లెలకు ఊపిరి**

కూటమి ప్రభుత్వం పల్లెలకు ఊపిరిపోసింది. గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేస్తూ పల్లెపండుగ పేరుతో పనులు, నిధులు మంజూరు చేసింది. పంచాయతీలకు ఆర్థికంగా చేయూతనందిస్తోంది. ఆర్థిక సంఘంతో పాటు రాజ్యాంగబద్ధ చెల్లింపులు సకాలంలో చేస్తోంది. స్థానిక సంస్థలు నిలదొక్కుకునేలా చేసింది.

-అబద్దం, సర్పంచ్, బియ్యాలపేట, విజయనగరం మండలం

పింఛన్లను పెంచడం బాగుంది..



గత ప్రభుత్వ హయాంలో వెయ్యి రూపాయలను పెంచడానికి నాలుగేళ్ల కాలం తీసుకున్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.వెయ్యి పెంచి.. ప్రతినెలా 1న ఇవ్వడం ఎంతో బాగుంది.

- ఉత్తరావల్లి సూర్యనారాయణ, ఆగూరు వీధి, బొబ్బిలి

యాప్‌ల భారం నుంచి ఉపశమనం..



కూటమి ప్రభుత్వ పాలన పుణ్యమా అని యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగింది. ఎస్ఏలకు పదోన్నతి కల్పించి ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎంలుగా నియమించడం విప్లవాత్మకమైనది. ఉపాధ్యాయ బదిలీలకు చట్టం తీసుకురావడమనేది గొప్ప విషయం.

- బొత్స సత్యనారాయణ, రిటైర్డ్ టీచరు, బొబ్బిలి

సంక్షేమం ధ్యేయంగా.. అభివృద్ధి అజెండాగా

(మూడో పేజీ తరువాయి)

దీర్ఘకాలిక రోగులు.. తదితర 14 విభాగాలకు చెందిన 2,79,336 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెల రూ.116 కోట్లు వీరికి పింఛన్ల పంపిణీకి ఖర్చు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి నెలలో మూడు నెలల పాత బకాయితో కలిపి గత ఏడాది జూలైలో రూ.7 వేలు అందించింది.

నిరుద్యోగుల్లో సంతోషం

కూటమి ప్రభుత్వం 16వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 583 పోస్టులను భర్తీ చేయనున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదు. సరిగా 2024 ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేశారు. కొద్దిరోజులకే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డీఎస్సీ నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మెగా డీఎస్సీని ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆనందం నెలకొంది.

ఉచితంగా సిలిండర్లు

కూటమి ప్రభుత్వంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు జీవన కష్టాలు తొలగాయి. ముఖ్యంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తుండడంతో వారిపై కొంత ఆర్థికభారం తగ్గించినట్లయింది. ప్రస్తుతం జిల్లాలో 6,61,547 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రేషన్‌కార్డుల ప్రతిపాదికగా తీసుకుంటే 5,81,688 మందికి రాయితీ వర్తిస్తుంది. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం ద్వారా రూ.142 కోట్ల ఆర్థికబారం ప్రభుత్వంపై పడుతోంది.

ఇసుకా ఉచితమే..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉచితంగా ఇసుక అందించి సామాన్య, మధ్యతరగతి వర్గాలకు కొండంత అండగా నిలిచింది. టన్ను ఇసుకను నామమాత్రంగా రూ.609కి అందిస్తున్నారు. ప్రభుత్వ ఫీజు లేదు. సీనరేజ్, నిర్వహణ ఖర్చులనే వసూలు చేస్తున్నారు. జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి ఇసుక కొరత లేకుండా నిర్మాణదారులకు అందించారు. వేలాది కార్మికులకు ఉపాధి మెరుగయ్యేలా చేశారు. పల్లెపండుగ పేరిట జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సీసీ కాలువలు, రహదారుల నిర్మాణం చేపట్టారు. రూ.151.90 కోట్లతో 2,199 పనులు పూర్తిచేసింది.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు..

ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలకు తెరతీసింది కూటమి ప్రభుత్వం. మనమిత్ర యాప్ పేరిట 95523 00009 నంబర్‌కు హాయ్ అని చెబితే చాలు. మనకు అవసరమైన సేవల వివరాలు వస్తాయి. అందులో పొందుపరిస్తే క్షణాల్లో మనకు అవసరమైన సేవలు పొందేందుకు అవకాశం ఉంది. తొలిదశలో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలను అందుబాటులోకి తెచ్చారు. మలి విడతలో మరో 300 సేవలు అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే విద్యార్థుల హాల్‌టిక్కెట్లు, పరీక్ష ఫలితాలు ఈ గవర్నెన్స్ ద్వారా అందించారు.

పాడిరైతులకు ప్రోత్సాహం

వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం. ముఖ్యంగా పాడిరైతులను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున పశువుల శాలల నిర్మాణం చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా గోకులాల పేరిట 700 పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

పీపీపీ పద్ధతిలో రహదారుల నిర్మాణం

జిల్లాలో ప్రధాన రహదారులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గుంతల్లో రోడ్లను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం ప్రధాన రహదారులను బాగుచేయాలన్న ఆలోచన కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం జిల్లాలోని రహదారులతో పాటు అంతర్రాష్ట్ర రోడ్లను పీపీపీ విధానంలో నిర్మించాలని యోచించింది. దీనికి రూ.613.91 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు.

జెట్ స్పీడ్‌తో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం

కూటమి ప్రభుత్వం రాకతో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు జెట్ స్పీడుతో సాగుతున్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్‌తో విమానాశ్రయ నిర్మాణం సాగుతోంది. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం రావడం.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడంతో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు మళ్లీ కదలిక వచ్చింది. తక్కువ వ్యవధిలోనే నిర్మాణం జోరందుకుంది.

ఎంఎస్ఎంఈ పార్కులతో కొత్త రూపు

కొత్తవలస మండలం బలిఘట్టం గ్రామ పరిధిలో 57.09 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఇతర చోట్ల కూడా శంకుస్థాపన చేశారు. ఈ పార్కుల్లో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ఆసక్తి ఉన్న వారికి స్థలాలను కేటాయించనున్నారు.

శరవేగంగా గిరిజన వర్సిటీ పనులు

గిరిజన యూనివర్సిటీ సాకారం చేసే దిశగా టీడీపీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో నత్తతో పోటీపడిన వర్సిటీ పనులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మెరుపువేగంతో జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా పూర్తిచేయించి వర్సిటీని అందుబాటులోకి తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. వర్సిటీపై ముఖ్యమంత్రి చంద్రబాబు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ సత్ఫలితాలను ఇస్తున్నాయి. వర్సిటీ పనులు ఊపందుకోవడంతో జిల్లావాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

బడికి వేళాయె

(మూడో పేజీ తరువాయి)

పేరుతో విద్యామిత్ర కిట్లు అందించనుంది. ఒక్కో కిట్‌లో పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌తో పాటు రాత పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, మూడు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, రెండుజతల సాక్సులు, బ్యాగ్, బెల్ట్‌ను అందజేస్తారు. గతంలో మాదిరిగా కాకుండా సరికొత్త రంగుల ఏకరూప దుస్తులను ఎంపిక చేశారు. బాలబాలికలకు గతంలో వేర్వేరురంగుల దుస్తుల్ని అందించగా ఈసారి అందరికీ ఒకేరంగు దుస్తులు ఇవ్వనున్నారు. దుస్తులు కుట్టించుకునేందుకు అవసరమైన మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుంది. కిట్ల తరలింపు ప్రక్రియను ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు.

సన్నబియ్యంతో భోజనం

మధ్యాహ్న భోజన పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్చారు. దీంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పోషకాలతో కూడిన సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. గతంలో 50 కిలోల బియ్యం బస్తాలు అందించగా ఈసారి 25 కిలోల బ్యాగ్‌లు ఇచ్చేలా మార్పులు చేశారు. బియ్యంలో అక్రమాలు చోటుచేసుకోకుండా క్యూ ఆర్‌కోడ్ ఉన్న ట్యాగ్‌ను ఏర్పాటు చేశారు.

నెగ్గిన అవిశ్వాసం

(మూడో పేజీ తరువాయి)

కౌన్సిలర్లు, వైసీపీ అసమ్మతి వర్గానికి చెందిన 11 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. వైసీపీకి చెందిన 9 మంది సమ్మతి కౌన్సిలర్లు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు.

● గత నెల 19న మున్సిపల్ ఛైర్మన్ పదవి టీడీపీ ఖాతాలో చేరిన సంగతి తెలిసిందే. అదే బాటలో వైస్ ఛైర్‌పర్సన్ పదవి కూడా టీడీపీ ఖాతాలో జమ అయింది. వైసీపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లలో ఐదుగురు గత నెలలో ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు వేసుకున్న సంగతి తెలిసిందే. రెండో వైస్‌ఛైర్మన్‌గా ఉన్న చెలికాని మురళీకృష్ణ ఆ పార్టీ నాయకులు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ బుధవారం నాటి మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో పాల్గొనడమే కాక అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి ఓటు వేయడం పెద్ద చర్చనీయాంశమైంది. ఈ పరిణామంతో చెలికాని వైస్‌ఛైర్మన్ పదవికి ఎటువంటి ముప్పు వాటిల్లబోదని అధికార తెలుగుదేశం, వైసీపీ శిబిరాల్లో బహిరంగంగా వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి.

నాపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు

గతంలో తెలుగుదేశం పార్టీలో కౌన్సిలరుగా ఉన్నప్పుడు గాని, వైసీపీ హయాంలో మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు గాని తనపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు.. అయినా అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేశారు అని పదవీ చ్యుతురాలైన వైస్‌ఛైర్‌పర్సన్ గొలగాని రమాదేవి నిరాశ వ్యక్తం చేశారు. తన పదవికి ముప్పు ఉందని తెలుసుకొని ఆమె వైసీపీ కౌన్సిలర్లతో సహా బుధవారం నాటి ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేదు. తనపై అవిశ్వాసం నెగ్గిందని అధికారికంగా తెలిసిన తరువాత స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ విధంగా తనను పదవి నుంచి తప్పించడం చాలా అన్యాయమని రమాదేవి వాపోయారు.